ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

శనివారం 15 జూన్ 2024

20న చెన్నైకి ప్రధాని మోదీ రాక



చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఒక్క రోజు పర్యటన నిమిత్తం ఈనెల 20న చెన్నైకి విచ్చేయను న్నారు. ప్రధానిగా మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన నగరానికి విచ్చేయనుండటంతో స్థానిక బీజేపీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. అధికారిక సమాచారం మేరకు ప్రధాని మోదీ ఈ నెల 20 ఎగ్మూరు రైల్వేస్టేషన్‌లో నాగర్‌కోవిల్‌కు వందే భారత్ రైలు సేవలను పచ్చ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు.





నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన విద్యాశాఖ వేడుకల్లో ప్లస్-2 పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సీఎం స్టాలిన్ - తమిళ పాఠ్యాంశంలో నూటికి నూరు మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులతో స్టాలిన్

ఆగస్టు నుంచి 'తమిళ్ పుదల్వన్' పథకం

ప్రతి నెలా విద్యార్థులకు రూ.1000

సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆరో తరగతి నుంచి ప్లస్-2 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రస్తుతం ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రతినెలా రూ.1000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే 'తమిళ్ పుదల్వన్' పథకాన్ని ఆగస్టు నుంచి అమలు చేయనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం నెహ్రూ స్టేడియంలో టెన్త్, ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సత్కారం, పబ్లిక్ పరీక్షల్లో తమిళ పాఠ్యాంశంలో నూటికి నూరు మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సత్కారం, ప్రాథమిక విద్యావిభాగం ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతుల ప్రారంభోత్సవం, క్రీడా పోటీల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు సత్కారం... ఇలా ఒకే వేదికపై ఐదు వేడుకలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రత్యేకించి 16 లక్షల మంది ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల ఆకలిని తీర్చే అల్పాహార పథకం, 27లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కలిగించే 'ఇళ్ల వద్దకే విద్య పథకం', 28లక్షల మంది కళాశాల విద్యార్థులకు నాన్ ముదల్వన్ పథకం కింద ప్రతిభాపాటవాలపై శిక్షణ కార్యక్రమాలు, 23 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందే ఎన్నుమ్ ఎళుత్తుమ్, 30 లక్షల విద్యార్థుల కోసం 'పఠనాసక్తి పథకం' అమలు చేస్తున్నామన్నారు. వీటన్నింటి కంటే ఆరో తరగతి నుంచి ప్లస్-2 దాకా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థినులకు ప్రతినెలా రూ.1000 చెల్లించే పుదుమైపెణ్ పథకం రాష్ట్రంలో సరికొత్త విద్యా విప్లవాన్ని సృష్టించిందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో విద్యార్థినులకు అమలు చేస్తున్నట్లుగానే విద్యార్థులకు కూడా 'తమిళ్ పుదల్వన్' పథకం కింద ప్రతినెలా రూ.1000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చానన్నారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ఇప్పటికే ఉన్నతవిద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులందరికీ ప్రతినెలా రూ.1000లను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 1728 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను ఆయన అందించారు. ఇదే విధంగా తమిళ పాఠ్యాంశంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 35 మంది ప్లస్-2 విద్యార్థులకు, ఎనిమిది మంది పదో తరగతి విద్యార్థులకు తలా రూ.10వేల చొప్పున నగదు అందజేశారు. ఆ తర్వాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 500 స్మార్ట్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉదయనిధి, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, జీసీసీ మేయర్ ప్రియ, ఎంపీ దయానిధి మారన్, శాసనసభ్యుడు పరంధామన్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షుడు లియోనీ, కార్యదర్శి కుమార గురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- 9 శాతం డీఏ పెంపు
- జీవో జారీ చేసిన సర్కారు

అడయార్, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో కొందరికి డీఎంకే సర్కారు శుభవార్త చెప్పింది. 2016 సంవత్సరానికి ముందు అమల్లో ఉన్న వేతన భత్యాలను అందుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు 9 శాతం డీఏ పెంచుతూ శుక్రవారం జీవో జారీ చేసింది. ఈ పెంచిన డీఏ ఈ యేడాది జనవరి 1వ తేదీ నుంచి అందజేయనున్నారు. తాజా పెంపుతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు బేసిక్ పే, డీఏలో 239 శాతం అందుకోనున్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలకు సంబంధించిన పెంచిన డీఏను ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయనున్నారు. ఈ డీఏ పెంపునకు సంబంధించి జీవో ఆలస్యంగా జారీ చేయడానికి ప్రధాన కారణం... సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండటమే అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ డీఏ పెంపును పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వాగతిస్తున్నాయి.

చేపల వేటకు మత్స్యకారులు

కోస్తా తీర ప్రాంతాల్లో 'హైలెస్సా' సందడి



పడవల్లో ఐస్, వలలు సిద్ధం చేసుకుంటున్న జాలర్లు



ప్యారీస్, జూన్ 14: తమిళనాడు, పుదుచ్చేరిలకు ఆనుకొని ఉన్న బంగాళాఖాతంలో 61 రోజులు చేపల వేటపై విధించిన నిషేధం శుక్రవారంతో పూర్తైన కారణంగా అర్ధరాత్రి నుంచి జాలర్లు 'హైలెస్సా' అంటూ తమ పడవల్లో సందడి చేస్తూ సముద్రంలో చేపల వేటకు ఉత్సాహంగా బయల్దేరి వెళ్లారు. చేపలు, సముద్రజీవుల సంతానోత్పత్తి జరిగే సమయంలో కేంద్ర ప్రభుత్వం 2000 సంవత్సరం నుంచి 45 రోజులు చేపల వేటపై నిషేధం విధించింది. 2017వ సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ నిషేధకాలాన్ని 61 రోజులకు పొడిగించింది. ఇది అమలులో ఉన్న సమయంలో బంగాళాఖాతంలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపల వేట నిషేధకాలం ఏప్రిల్ 15న ప్రారంభమై జూన్14న శుక్రవారంతో ముగిసింది. దీంతో, స్థానిక కాశిమేడు, పట్టిణంబాక్కం, తిరుపోరూర్, మహాబలిపురం, అక్కరై, పుదుకోట, తంజావూరు, సేలం తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు సుమారు 8,000కు పైగా మరబోట్లలో హైలెస్సా...హైలెస్సా అంటూ పాడుతూ చేపల వేటకు బయల్దేరి వెళ్లారు. కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో సుమారు

మరబోట్ల జాలర్లు మాత్రం సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. ఇక, నాటు పడవలతో మత్స్యకారులు సముద్రతీరం నుంచి రెండు నాటికల్ మైళ్ల దూరం వరకే చేపల వేటలో ఈ రెండు నెలల నుంచి పాల్గొంటున్నారు.

1,000 మరబోట్లకు గత రెండు నెలలుగా మరమ్మతులు పూర్తిచేశారు. శుక్రవారం సాయంత్రం సముద్రతీరంలో ఈ పడవలు నిలిపి అవసరమైన డీజిల్ నింపారు. పెద్ద సైజు మంచు ముక్కలను యంత్రాల ద్వారా పగులగొట్టి ఐస్ బాక్స్‌ల్లో నింపుకున్నారు. మరబోటుల్లో చేపల వేటకు వెళ్లిన వారు వారం నుంచి రెండు వారాలు సముద్రంలో గడిపి వారు విసిరిన వలలో చిక్కుకునే చేపలతో తీరానికి తిరిగొస్తారు. ఈ నేపథ్యంలో, చేపల వేట నిషేధకాలంలో ఉపాధి కోల్పోయిన జాలర్లకు ప్రభుత్వం రెండు నెలలు ఆర్థికసాయం పంపిణీ చేసింది. అంతేకాకుండా, చేపల వేటకు సిద్ధమైన మత్స్యకారులకు రాయితీ ధరలో డీజిల్ అందించింది. వేటకు వెళుతున్న సందర్భంగా కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు మీడియాతో మాట్లాడారు. చేపల వేటపై విధించిన నిషేధకాలంలో చేపలు, రొయ్యలు, పీతలు తదితరాల ధరలు అధికమయ్యాయని, మరో రెండు రోజుల్లో ఈ ధరలు తగ్గే అవకాశముందన్నారు. మేలు రకం రొయ్యలు, పెద్ద చేపలు సహజంగా లోతైన సముద్రప్రాంతాల్లో మాత్రమే లభ్యమవుతాయని, అందువల్ల ఆ ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఒక్కో మరబోటు మరమ్మతుకు కనీసం రూ.8 లక్షలు ఖర్చవుతుందని, డీజిల్ రాయితీగా 1,800 లీటర్లు మాత్రమే పంపిణీ చేస్తున్నారని, అందువల్ల నష్టపోతున్న తమను ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, అరేబియా సముద్రంలో ఈ నెల 1వ తేది నుంచి చేపల వేట నిషేధకాలం ప్రారంభమై జూలై 31వ తేది వరకు కొనసాగుతుంది. అందువల్ల తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలకు చెందిన జాలర్లు అరేబియా సముద్రం ప్రాంతానికి చేపల వేటకు వెళ్లరాదని రాష్ట్రప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది.

ప్రైవేటు పాఠశాలలో చొరబడిన చిరుత

- దాడిలో ఒకరికి గాయం



కారు షెడ్‌లో దాగిన చిరుత (పక్క చిత్రంలో) - గాయపడిన గోపాల్

పెరంబూర్, జూన్ 14: తిరుపత్తూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం చిరుత ప్రవేశించడం కలకలం రేపింది. కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులందరూ తరగతి గదుల్లో ఉన్నారు. ఆ సమయంలో పాఠశాల వాహనాలకు గోపాల్ అనే వ్యక్తి రంగులు వేస్తున్నాడు. ఇంతలో ఊహించని విధంగా పాఠశాల ప్రాంగణంలోకి చొరబడిన చిరుత గోపాల్‌పై దాడి చేసింది. గమనించిన చుట్టుపక్కల వారు వేసిన కేకలతో ఆ చిరుత సమీపంలోని కారు షెడ్‌లోకి వెళ్లింది. పాఠశాలలో చిరుత ప్రవేశించిందన్న సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే కొందరు యువకులు తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పోలీసు, అటవీ, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకున్నారు. అంతలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాల వెలుపలికి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రాంగణాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా ఆధారంగా చిరుత కదలికలను అధికారులు పరిశీలించారు. చిరుతకు మత్తు ఇంజక్షన్ వేసి బంధించాలని నిర్ణయించిన అధికారులు వెటర్నరీ వైద్యులను రప్పించారు. ఇంజక్షన్ వేసేలోపు చిరుత బయటకు వస్తే దానిని బంధించేలా ఆ ప్రాంతంలో వలలు ఏర్పాటుచేశారు. రాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతంలో కాంతివంతమైన లైట్లు ఏర్పాటుచేసే పనులను విద్యుత్ బోర్డు సిబ్బంది చేపట్టారు.

2,200 కొత్త బస్సుల కొనుగోలుకు టెండరు విడుదల

- మంత్రి శివశంకర్

ప్యారీస్, జూన్ 14: రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని రవాణా సంస్థలకు కొత్తగా 2,200 బస్సులు కొనుగోలుకు టెండరు విడుదల చేసినట్లు ఆ శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ పేర్కొన్నారు. కడలూరు జిల్లా నెయివాసల్ లోని వెల్లారు చెరువులో 2015వ సంవత్సరం అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వంలో పనిచేసిన ఇసుక క్వారీని శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ గ్రామస్తులతో అప్పటి కున్నం డీఎంకే ఎమ్మెల్యేగా వ్యవహరించిన శివశంకర్ నేతృత్వంలో ధర్నా జరిగింది. ఆందోళనకారులు ఇసుక క్వారీల్లో చొరబడి విధ్వంసం సృష్టించారని, గ్రామస్తులు హద్దు మీరి ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేయడంతో వారిని పోలీసులు లాఠిఛార్జీతో తరిమికొట్టారు. అనుమతి లేకుండా నిర్వహించిన ఈ ఆందోళనకు సంబంధించి ప్రస్తుత రవాణా శాఖ మంత్రి శివశంకర్ సహా 37 మందిపై కేసు నమోదైంది. శుక్రవారం ఈ కేసు విచారణకు హాజరయ్యేందుకు మంత్రి శివశంకర లాయర్లతో కలసి వెళ్లి న్యాయమూర్తి జవహర్ సమక్షంలో హాజరయ్యారు. కేసుల వాదనల అనంతరం కేసు విచారణ ఈ నెల 25వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మంత్రి కోర్టు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ... 2021 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజకిచ్చిన 100 హామీల్లో ఇప్పటివరకు 85 శాతం హామీలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. రాష్ట్రానికి గతంలో 2,000 కొత్త బస్సులు కొనుగోలుకు కేటాయించిన నిధుల నుంచి ప్రస్తుతం 850 బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ప్రతినెలా 200 కొత్త బస్సులు నడిపేందుకు రూట్లు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 2,200 కొత్త బస్సుల కొనుగోలుకు టెండరు విడుదల చేశామని, వచ్చే డిసెంబరులోపు 7,200 కొత్త బసు కొనుగోలకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి శివశంకర్ వివరించారు.



విచారణకు హాజరయ్యేందుకు లాయర్లతో కడలూరు కోర్టుకు విచ్చేసిన మంత్రి శివశంకర్

విక్రవాండి ఉపఎన్నిక

పద్మరాజన్ సహా నలుగురి నామినేషన్



కరెన్సీ నోట్ల మాలను ధరించి నామినేషన్ వేయడానికి వెళుతున్న అగ్ని ఆళ్వార్

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నామినేషన్ల స్వీకరణ ఘట్టం శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో అధికార పక్షం డీఎంకే తరఫున ఆ పార్టీ రైతు కార్మిక సంఘ కార్యదర్శి అన్నియూరు శివ పోటీ చేయనున్నారు. ఇదే విధంగా నామ్‌తమిళర్ కట్చి అభ్యర్థిగా డాక్టర్ అభినయ పొన్నివలవన్‌ను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ నేత సీమాన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు నలుగురు ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో మేట్టూరుకి చెందిన ఎన్నికల వీరుడు పద్మరాజన్ కూడా ఉన్నారు. తొలుత ధర్మపురి జిల్లాకు చెందిన అగ్ని ఆళ్వార్ అనే వ్యక్తి కరెన్సీ నోట్ల మాలను ధరించి నామినేషన్ వేయడానికి వెళ్లడంతో కలకలం సృష్టించింది. ఆ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దనున్న పోలీసులకు, ఆయనకు మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. చివరకు నోట్ల కట్టల మాలతోనే నామినేషన్ వేయడానికి అనుమతించారు. అగ్ని ఆళ్వార్ నామినేషన్ డిపాజిట్ రూ.10వేలను చిల్లర నాణేలుగా సమర్పించారు. ఆ నాణేలను ముగ్గురు సిబ్బంది లెక్కించారు. కోయంబత్తూరు జిల్లా సుందరాపురానికి చెందిన నూర్ మహమ్మద్, సేలం జిల్లా మేట్టూరుకు చెందిన ఎన్నికల వీరుడు పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. తిరుచ్చికి చెందిన రాజేంద్రన్ డిజిటల్ చెల్లింపులపై అవగాహన ప్రచారం చేసేలా మెడలో డెబిట్, క్రెడిట్ కార్డుల మాలను ధరించి వెళ్లి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఇక పద్మరాజన్ నామినేషన్ వేసిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ అఖిల భారత స్థాయిలో తాను ఇప్పటి వరకూ 231 నామినేషన్లు వేసి డిపాజిట్లు కోల్పోయానని, ప్రస్తుతం 232వ సారి నామినేషన్ వేశానని చెప్పారు.

స్వస్థలానికి కువైట్ అగ్నిప్రమాద మృతదేహాలు



భౌతికకాయాలకు నివాళి అర్పిస్తున్న కేరళ సీఎం పినరయి విజయన్, రాష్ట్ర మంత్రి సెంజి మస్తాన్ తదితరులు

ప్యారీస్, జూన్ 14: కువైట్‌లో ఎన్టీపీసీ చమురు సంస్థ కార్మికులు నివసిస్తున్న భవన సముదాయంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయుల భౌతికకాయాలు ప్రత్యేక విమానం ద్వారా శుక్రవారం స్వదేశానికి తరలించగా, ఏడుగురు తమిళుల మృతదేహాలను రాష్ట్ర మైనార్టీల సంక్షేమశాఖ మంత్రి సెంజి మస్తాన్ స్వీకరించారు. కువైట్ సౌత్ అహ్మది ప్రావిన్స్ మంగాఫ్ ప్రాంతంలోని నాలుగంతస్తుల భవన సముదాయంలో ఎన్టీపీసీ చమురు సంస్థలో పనిచేస్తున్న కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కార్మికులు నివసిస్తున్నారు. బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఈ భవనంలో నివసించిన కార్మికుల్లో పలువురు మంటల్లో చిక్కుకుని మరణించగా, మరికొందరు గాయాలతో బయటపడ్డారు. ఈ దుర్ఘటనలో 53 మంది భారతీయులు మరణించినట్లు కువైట్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి సెంజి మస్తాన్, ఇతర అధికారులతో కలసి చర్చించి కువైట్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారుల ద్వారా మృతిచెందిన తమిళుల వివరాలను సేకరించారు. రామనాథపురం జిల్లా పెన్నమలూరుకు చెందిన రాముకరుప్పన్, విల్లుపురం జిల్లా సెంజికి చెందిన మహమ్మద్ షరీఫ్, కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్‌కు చెందిన చిన్నదురై, పేరావూరణి సమీపంలోని ఆదనూరుకు చెందిన రిచర్డ్‌రాయ్, తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టికి చెందిన వీరాస్వామి మారియప్పన్, చెన్నైలోని రాయపురానికి చెందిన జి.శివశంకర్, తిరుచ్చి జిల్లాకు చెందిన ఇ.రాజు మృతదేహాలు సహా 45 మంది భారతీయుల భౌతికకాయాలను ప్రత్యేక విమానం ద్వారా కేరళ రాష్ట్రంలోని కొచ్చి విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, రాష్ట్ర మంత్రి సెంజి మస్తాన్ మృతులకు అంజలి ఘటించారు. అనంతరం అంబులెన్స్‌ల ద్వారా తమిళుల మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు మంత్రి సాగనంపారు.

మృతుల కుటుంబాలకు తలా రూ.5 లక్షల ఆర్థిక సాయం..

కువైట్ అగ్నిప్రమాదంలో మృతిచెందిన ఏడుగురు తమిళుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తలా రూ.5 లక్షలు సాయం అందజేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సాయాన్ని మృతులకు సంబంధించిన జిల్లాల కలెక్టర్లు నేరుగా ఆ కుటుంబీకులకే అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

సమాచార దర్శిని

ఆలయ వాచ్‌మెన్ పోస్టుల భర్తీ

ఐసిఎఫ్, జూన్ 14: ఆలయాల్లో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్ పోస్టులను నేరుగా భర్తీ చేయాలని అధికారులకు హిందూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ మురళీధరన్ అధికారులకు పంపిన సర్క్యులర్‌లో... ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ఆలయాల్లో ఖాళీగా ఉన్న ఈ పోస్టులు నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 21వ తేది లోపు విడుదల చేయాలని పేర్కొన్నారు.

పచ్చి బఠానీ కిలో రూ.400

ఐసిఎఫ్, జూన్ 14: పచ్చి బఠానీలు కిలో రూ.400 విక్రయమవుతున్నాయి. నీలగిరి జిల్లా ఊటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో పచ్చి బఠానీలు నాణ్యత కలిగి ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారులు కొనుగోలు చేసి మార్కెట్లకు తరలిస్తుంటారు. శీతోష్ణస్థితిలో మార్పులు, వన్యమృగాల బెడద వంటి కారణాలతో ఈ పంట దెబ్బతింది. రెండు రోజులుగా దిగుబడి తగ్గడంతో మార్కెట్లో ధరలు రెట్టింపయ్యాయి. సాధారణంగా కిలో రూ.180 నుంచి రూ.250 వరకు విక్రయమయ్యే బఠానీలు, గురువారం రూ.400కు విక్రయమయ్యాయి.

ఐఐటీలో స్పోర్ట్స్ కోటా

ఐసిఎఫ్, జూన్ 14: ఇంజనీరింగ్ విద్యార్థుల అడ్మిషన్లలో దేశంలో తొలిసారిగా స్పోర్ట్స్ కోటాను చెన్నై ఐఐటీ ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ వంటి వాటిల్లో ఇంజనీరింగ్ అడ్మిషన్లు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా జరుగుతున్నాయి. జేఈఈ, జేఈఈ అడ్వాన్స్‌డ్ అనే ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల ఆధారంగా బీఈ అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నై ఐఐటీలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అనే కేంద్రాన్ని రూపొందించి, అందులో పాఠశాల ప్రాయం నుంచే క్రీడల్లో రాణించిన విద్యార్థులను బీఈలో చేర్చుకొనేందుకు నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన ప్రకటనను ఐఐటీ డైరెక్టర్ కామకోటి విడుదల చేశారు. ఈ కోటాలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు https://jeeadv.iitm.ac.in/sea/index.htmlలో దరఖాస్తు చేసుకోవాలి.

పట్నా-మంగళూరు ప్రత్యేక రైలు

ఐసిఎఫ్, జూన్ 14: పట్నా నుంచి చెన్నై ఎగ్మూర్ మీదుగా మంగళూరుకు ప్రత్యేక రైలు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. బిహార్ రాష్ట్రం పట్నా నుంచి ఈ నెల 15, 22, 29 తేదీల్లో రాత్రి 10.30 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు చెన్నై ఎగ్మూర్ మీదుగా నాలుగవ రోజు ఉదయం 7 గంటలకు కర్ణాటక రాష్ట్రం మంగళూరు సెంట్రల్ చేరుకుంటుంది. మంగళూరు సెంట్రల్ నుంచి ఈ నెల 18, 25, జూలై 2 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు చెన్నై పెరంబూర్ మీదుగా నాలుగవ రోజు ఉదయం 5.30 గంటలకు పట్నా చేరుకుంటుంది.

26న తపాలా గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూన్ 14: స్థానిక అన్నాసాలై ప్రధాన తపాలా కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేది ప్రత్యేక గ్రీవెన్స్ జరగనుంది. మనీ ఆర్డర్, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పొదుపు ఖాతా, బీమా వంటి వాటికి సంబంధించిన సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలని వినియోగదారులకు సూచించారు.

13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

ఐసిఎఫ్, జూన్ 14: రాష్ట్రవ్యాప్తంగా 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి రీటా హరీస్ టక్కర్ ప్రజా, పునరుజ్జీవన శాఖ కార్యదర్శిగాను, ఆ శాఖ కార్యదర్శి నందకుమార్ మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. దివ్యాంగులు, మానవవనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి నాగరాజన్ ఆర్థిక శాఖ కార్యదర్శిగాను, సెలవుపై ఉన్న దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి థామస్ వైద్యన్ మళ్లీ అదే శాఖకు నియమితులయ్యారు. తమిళనాడు గృహవసతి శాఖ మేనేజింగ్ డైరెక్టర్ శవరణ సెల్వరాజ్ భౌగోళిక, సొరంగాల శాఖ కమిషనర్‌గాను, తమిళనాడు చక్కెర పరిశ్రమల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌రాజ్‌కుమార్ బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. వీరితో సహా 13 మంది వివిధ శాఖలకు బదిలీ అయ్యారు.

రూ.2,820 కోట్లతో 28 మెట్రో రైళ్ల కొనుగోలు

పెరంబూర్, జూన్ 14: నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం రూ.2,820 కోట్లతో ఆరు పెట్టెలతో కూడిన 28 కొత్త మెట్రోరైళ్ల కొనుగోలు చేయాలని సీఎంఆర్ఎల్ నిర్ణయించింది. వింకోనగర్ నుంచి విమానాశ్రయం, సెంట్రల్ నుంచి సెయింట్ థామస్ మౌంట్ మార్గాల్లో సుమారు 55 కి.మీ దూరం మెట్రో రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రైళ్లలో రోజుకు సుమారు 3 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. నగరంలో తెల్లవారుజామున 4.30 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రోరైళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 45 రైళ్లు నడుపుతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో 2025 నాటికి 28 కొత్త రైళ్లు కొనుగోలు చేయాలని సీఎంఆర్ఎల్ నిర్ణయించింది.

డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు

ఐసిఎఫ్, జూన్ 14: డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు జరుగనున్నాయి. ఈ విభాగం కలైంజర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 'ఎన్ ఉయిరినుం మేలాన' అనే శీర్షికన రాష్ట్రవ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహించనుంది. 18 నుంచి 35 ఏళ్లలోపున్న పురుషులు, మహిళలు, హిజ్రాలు పాల్గొనవచ్చు. ఔత్సాహికులు www.kalaignar100pechu.org లో జూలై 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. గెలుపొందే వారికి మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.75 వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు అందజేయనున్నారు. అలాగే, పార్టీ అధిష్ఠానం ప్రకటించిన ప్రకారం పోటీల్లో పాల్గొన్న వారిలో 100 మందిని ఎంపిక చేసి పార్టీ వక్తలుగా పరిచయం చేయనున్నారు.

సముద్రంలోకి 2.15 లక్షల తాబేలు పిల్లలు

ఐసిఎఫ్, జూన్ 14: రాష్ట్రంలో ఈ ఏడాది సంబంధించిన సీజన్‌లో 2.15 లక్షల తాబేలు పిల్లలను సముద్రంలో వదిలినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. చెన్నై సహా వివిధ సముద్రతీర జిల్లాల్లో యేటా జనవరి నుంచి ఏప్రిల్ వరకు సముద్రపు తాబేళ్లు తీరానికి వచ్చి గుడ్లు పెట్టి వెళుతుంటాయి. వాటిని అటవీ శాఖ అధికారులు సేకరించి పిల్లలు పొదిగిన అనంతరం వాటిని సముద్రంలోకి వదిలిపెడుతుంటారు. ఆ ప్రకారం, చెన్నై సహా 8 జిల్లాల్లో 53 ప్రాంతాల్లో సేకరించిన 2.58 లక్షల గుడ్లను కృత్రిమ విధానంలో పొదిగించారు. గుడ్ల నుంచి వెలుపలికి వచ్చిన 2.15 లక్షల తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టారు. గత ఏడాది ఇదే సమయంలో 1.82 లక్షల తాబేలు పిల్లలను సముద్రంలో వదిలినట్లు అధికారులు తెలిపారు.

డాక్టర్ సుబ్బయ్య హత్య కేసులో ఏడుగురి ఉరిశిక్ష రద్దు

● హైకోర్టు సంచలనాత్మక తీర్పు


ఇన్‌సెట్‌లో డాక్టర్ సుబ్బయ్య

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజా అన్నామలైపురంలో పదకొండేళ్లకు ముందు జరిగిన ప్రముఖ న్యూరాలజిస్ట్ సుబ్బయ్య హత్య కేసులో ఏడుగురికి దిగువ కోర్టు విధించిన ఉరిశిక్షను రద్దు చేస్తూ హైకోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. 2013లో పట్టపగలు రోడ్డులో నడిచివెళుతున్న సుబ్బయ్యను గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి జరిపి హతమార్చారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో ఈ హత్యకు సంబంధించిన వీడియో దృశ్యాలు వెలువడి రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు. ఆ కేసులో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పొన్నుసామి, ఆయన కుమారులు లాయర్ బాసిల్, ఇంజనీర్ బోరిస్, విలియం, డాక్టర్ జేమ్స్ సతీష్‌కుమార్, ఇంజనీర్ మురుగన్, సెల్వ ప్రకాష్‌కు చెన్నై ప్రిన్సిపల్ కోర్టు ఉరిశిక్షను విధించింది. ఇదే విధంగా పొన్నుసామి భార్య మేరీ పుష్పం, కిరాయి ముఠాకు చెందిన కబడ్డీ వీరుడు ఏసురాజన్‌కు రెండు యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తూ 2021 ఆగస్టులో తీర్పు వెలువరించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ ఉరి శిక్ష పడిన ఏడుగురు నిందితులు, యావజ్జీవ కారాగార శిక్షపడిన ఇద్దరు హైకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు. ఈ అప్పీలుపై హైకోర్టు న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, సందుర మోహన్‌తో కూడిన ధర్మాసనం తుది విడత విచారణను గత మార్చిలో ముగించింది. ఆ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున డాక్టర్ సుబ్బయ్యకు, పొన్నుసామికి మధ్య కొనసాగిన భూవివాదాలే హత్యకు కారణమని వాదించారు. హత్య చేయడానికి కిరాయి ముఠాను ఏర్పాటు చేసుకోవడానికి రూ.7,5లక్షల మేరకు నగదు బట్వాడాలు జరిగినట్లు తెలిపే సాక్ష్యాధారాలు గురించి, అప్రూవర్ సాక్ష్యం తదితర వివరాలను ప్రాసిక్యూషన్ తరఫున సమగ్రంగా తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఈ అప్పీలుపై శుక్రవారం ధర్మాసనం హత్యకేసులో ఏడుగురిపై దిగువ కోర్టు విధించిన ఉరిశిక్షను, ఇరువురికి విధించి రెండు యావజ్జీవ కారాగార శిక్షలను రద్దు చేసి నిర్దోషులుగా విడుదల చేస్తూ తీర్పు వెలువరించింది. పోలీసుల తరఫు సాక్ష్యాలు నేరారోపణలను రుజువు చేయకపోవడం వల్లే ఈ కేసులో తొమ్మిది మందిని నిర్దోషులుగా విడుదల చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

వాలాజాబాద్‌లో అతిసారం

● ఇద్దరి మృతి
● 20 మంది ఆస్పత్రిలో చేరిక
● కలుషిత నీరే కారణమా?

అడయార్, జూన్ 14: కాంచీపురం జిల్లా వాలాజాబాద్ యూనియన్ వైయావూర్ కాలనీలో అతిసారం వ్యాపించింది. ఈ కారణంగా దాదాపు 50 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరు వృద్ధులు ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. బాధితులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో ఉన్న రెండు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నుంచి సరఫరా అయిన కలుషిత నీటిని సేవించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్టు ప్రచారం సాగుతోంది. నిజానికి ఈ ట్యాంకుల నుంచి సరఫరా చేస్తున్న నీరు కలుషితమైన విషయాన్ని గుర్తించిన స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ, వారు ఏమాత్రం స్పందించకపోవడంతో ఈ ఘోరం జరిగింది. ఈ కలుషిత జలాలను తాగిన ఈ కాలనీలోని ఎల్లయమ్మన్ ఆలయ వీధికి చెందిన అశ్విని(60), ఇదే వీధికి చెందిన సరోజ(70) ప్రాణాలు కోల్పోయారు. కాగా, ఈ అంశంపై స్థానిక వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి అతిసారం వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు చేపట్టారు. బాధిత ప్రాంతాల్లో క్లోరినేషన్ చేశారు. బాధితులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. ఈ ఘటన కారణంగా స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

రూ.78.67 కోట్లతో ఖరీఫ్ సాగు పథకం

● మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం

ప్యారీస్, జూన్ 14: డెల్టా జిల్లాల రైతులను ఆదుకొనేలా ప్రభుత్వం రూ.78.67 కోట్లతో ఖరీఫ్ సాగు పథకాన్ని రూపొందించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం పేర్కొన్నారు. డెల్టా రైతులకు లక్ష ఎకరాల విస్తీర్ణానికి 2,000 మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు సబ్సిడీ ధరలో రూ.3.85 కోట్లతో వ్యవసాయ విస్తరణ కేంద్రాల ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వరి నాట్లు పూర్తయిన అనంతరం సబ్సిడీగా ఎకరాకు రూ.4,000 చొప్పున లక్ష ఎకరాల విస్తీర్ణానికి రాష్ట్రప్రభుత్వం రూ.40 కోట్లను పంపిణీ చేస్తుం దని మంత్రి వివరించారు. జింక్ సారం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ సారాన్ని పెంచిన ఎరువుల వాడకానికి ఎకరాకు రూ.250 చొప్పున 25,000 ఎకరాల విస్తీర్ణానికి రూ.62.50 లక్షలు, జిప్సం ఎరువులు వాడే ప్రాంతాల్లో ఎకరాకు సబ్సిడీ గా రూ.250 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డెల్టా జిల్లాల్లో వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తూ ప్రస్తుతం ఉపాధి కోల్పోయిన రైతు కూలీలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి అవకాశాలు కల్పించేలా రూ.24.50 కోట్ల నిధులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

డిమాండ్ల సాధనకు ఉపాధ్యాయుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

వేలూరు, జూన్ 14: రాష్ట్ర ప్రాథమిక పాఠశాలల ఉపా ధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ సాధనకు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో చేప ట్టిన ధర్నాకు సంఘ జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యకర్తల కమిటీ సభ్యుడు సెల్వం ప్రసంగించారు. కొత్త ఆరోగ్య బీమా పథకం రద్దు, మోసాలకు పాల్పడుతున్న ఇన్సూరెన్స్ సంస్థల రద్దు సహా పలు డిమాండ్ల కోసం నినాదాలు చేశారు. ఆందోళన సమయంలో వర్షం కురిసినా ఉపాధ్యాయులు తడుస్తూనే కొనసాగిం చారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ జోసఫ్ అనన్యా, రాష్ట్ర సెక్రటరీ డేవిడ్ రాజన్, జాక్టో-జియో ఉన్నత స్థాయి కమిటీ సభ్యుడు, టెక్నికల్ విద్య ఉపాధ్యా యుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జనార్దనన్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సహా 100మంది మహిళా ఉపాధ్యాయులు సహా 200మంది ఆందోళనలో పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో


రోడ్డుపై బిందెలతో గ్రామస్తులు

వేలూరు, జూన్ 14: ఆనకట్టు తాలూ కా సత్యమంగళం పంచాయతీ కమిరాపాళ్యంలో ఆరు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారులకు తెలిపినా ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు శుక్రవారం ఉదయం బిందెలతో రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కేంద్ర, రాష్ట్రాల మధ్య వారధిగా పని చేస్తా

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

పెరంబూర్, జూన్ 14: కేంద్రప్రభుత్వం, రాష్ట్రానికి మధ్య వారధిగా పనిచేస్తానని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మురుగన్ తొలిసారిగా శుక్రవారం నగరానికి చేరుకున్నారు. ఆయనకు బీజేపీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ...రాష్ట్ర ప్రతినిధిగా పనిచేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ తనకు అవకాశం కల్పించారన్నారు. 2047లో అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలుస్తుందన్నారు. అందులో పనిచేసేందుకు నాకు అవకాశం కల్పించిన ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. గతంలోలాగే రాష్ట్రానికి భారీగా నిధులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానన్నారు. తప్పుడు ప్రకటనలు, సమాచారం వ్యాప్తి చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హెచ్చరించారు.

విక్రవాండి నామ్‌తమిళర్ కట్చి అభ్యర్థి

డాక్టర్ అభినయా పొన్నివలవన్



చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికలో నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా సిద్ధ వైద్యనిపుణురాలు అభినయ పొన్నివలవన్ (28) పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ సమన్వయకర్త సీమాన్ ప్రకటించారు. అభినయ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గంలో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో 65,381 ఓట్లు పొంది డిపాజిట్ కోల్పోయారు. ఈ నేపథ్యంలో పార్టీ సమన్వయకర్త సీమాన్ డాక్టర్ అభినయకు విక్రవాండి అసెంబ్లీ ఎన్నికలో పోటీ చేసే అవకాశం కూడా కల్పించారు.

పంటపొలాల్లో ఏనుగుల బీభత్సం


ఏనుగుల దాడిలో ధ్వంసమైన విద్యుత్‌స్తంభం

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం తీక్కి నారై కడుంగాయ్‌మరం ప్రాంతంలో నందగోపాల్ అనే రైతుకు చెందిన పంట పొలాల్లో శుక్రవారం వేకువజామున రెండు అడవి ఏనుగులు చొరబడి విధ్వంసం సృష్టించాయి. పొలంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని, ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని నేల కూల్చాయి. ఏనుగుల ఘీంకారాన్ని విని దిగ్భ్రాంతి చెందిన రైతులు పొలం వద్దకు పరుగెత్తారు. అప్పటికే ఆ రెండు ఏనుగులు పొలంలోని పంటలను పూర్తిగా ధ్వంసం చేశాయి. ఆ తర్వాత రైతులు టపాకాయలు పేల్చి, డప్పులు వాయించి సుమారు రెండు గంటలసేపు పోరాడి ఆ ఏనుగులను అడవిలోకి తరిమికొట్టారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


ప్రజలకు మొక్కలు అందజేస్తున్న ఎస్పీ మణివన్నన్

పెరంబూర్, జూన్ 14: స్థానిక గ్రీన్ సర్కిల్ సమీపం శ్రీపురం నారాయణి పాఠశాలల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ మణివన్నన్ పాల్గొని, ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీపురం స్వర్ణాలయం, శ్రీ నారాయణి పాఠశాలల ట్రస్టీ, డైరెక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రీన్ సర్కిల్, పాత బస్టాండ్, కాట్పాడి తదితర ప్రాంతాల్లో సుమారు 15 వేల మొక్కలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

16న పార్టీ శ్రేణులతో శశికళ భేటీ

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోయెస్‌గార్డెన్‌లో ఉన్న తన నివాసగృహంలో ఈ నెల 16న పార్టీ శ్రేణులతో భేటీ అవుతున్నట్లు అన్నాడీఎంకే అసమ్మతి వర్గ నాయకురాలు శశికళ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేస్తూ... లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయాన్ని చవిచూసిన నేపథ్యంలో విడిపోయిన వర్గాలను విలీనం చేసే బాధ్యత తనపై పడిందని, ఆ దిశగానే పార్టీ శ్రేణులను కలుసుకుని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు.

రాయపేట ఆసుపత్రిలో నర్సుపై డాక్టర్ లైంగిక వేధింపులా?

● వీడియో వైరల్

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాయపేట ప్రభుత్వ ఆసుపత్రిలో దుస్తులు మార్చే గదిలో డ్యూటీ డాక్టర్ ఒకరు ఓ నర్సును ఆలింగనం చేసుకుని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సంఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆయిషా మాట్లాడుతూ ఓ డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశాఖ కమిటీ విచారణ జరుపుతోందని తెలిపారు. డాక్టర్ వద్ద జరిపిన విచారణ వివరాలను మెడికల్ డైరెక్టరేట్‌కు పంపారని చెప్పారు. ఇక ఆక ఆ వీడియోకు సంబంధించి, ఆరోపణలకు గురవుతున్న డాక్టర్ వివరణ ఇస్తూ డ్యూటీకి ఆలస్యం వచ్చే సిబ్బంది పట్ల తాను కఠినంగా వ్యవహరించడం వల్ల తనపై కక్షగట్టి మార్ఫింగ్‌తో ఆ వీడియోను విడుదల చేశారని పేర్కొన్నారు. ఆసుపత్రిలోని పనిచేస్తున్నవారి వద్ద విచారణ జరిపితే తన గురించి చెడుగా ఎవరూ చెప్పరని ఆయన వివరణ ఇచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూన్ 14: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

గిండి: మార్కో వీధి, పరుత్తివాక్కం వీధి, గిండి ఎస్టేట్, మదురై వీధి, పుదుపేట వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, ముత్యాలరెడ్డి వీధి, మండి వీధి, నీతి స్కూల్, లబ్బయ్ వీధి, వేళచ్చేరి రోడ్డు, వేదగిరి వీధి, సంత ఏరియా, కత్తిపార నార్త్ మెయిన్ రోడ్డు, బీసీఎం కాలని, చక్రపాణి కాలని, మౌంట్ పూందమల్లి రోడ్డు, బాల్‌వెల్స్ రోడ్డు, తండుమా నగర్, పోలీస్ ఆఫీస్ రోడ్డు, పోలీస్ క్వార్టర్స్, అంబేద్కర్ నగర్, నజరేత్‌పురం, సిల్వర్ వీధి, రామాపురం, సెంతమిళ్ నగర్, తమిళనాడు హౌసింగ్ బోర్డు కాలని, సెన్‌తమిళ్ నగర్ మెయిన్ రోడ్డు, గోదాడి నగర్, అన్నై సత్యానగర్ మెయిన్ రోడ్డు, వళ్లువర్ రోడ్డు, పెరియార్ రోడ్డు, మూకాంబిగై నగర్, నరసింహన్ నగర్, కేకే పొన్నురంగం రోడ్డు, ఓంశక్తినగర్, కన్నదాసన్ నగర్, హనీస్ నగర్, సెనపాక్కం, రివర్ వ్యూ ఏరియా, సీఆర్ఆర్ పురం, ఎల్డీ కాలని, కావ్య గార్డెన్, రామమూర్తి అవెన్యూ, ఏవీ మల్లీస్ గార్డెన్, బ్లూమింగ్ గార్డెన్, ప్రైమాక్స్ మెగెస్టో కాలని

షోలింగనల్లూర్: మేడవాక్కం, జల్లడియన్ పేట, పెరుంబాక్కం గాంధీ వీధి, రాధా నగర్, పెరుంబాక్కం మెయిన్ రోడ్డు, రుక్మిణి నగర్, రామయ్య నగర్, ముల్లై వీధి, ఎన్ఎస్కే వీధి, శ్రీ కృష్ణా నగర్, ఆనందమ్మాళ్ నగర్, గ్లోబల్ రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని నగర్. **కేకే నగర్:** వలసరవాక్కం, ఆళ్వార్ తిరు నగర్, ఆర్కే నగర్ రోడ్డు, ఇందిరా గాంధీ రోడ్డు, భారతియార్ వీధి, గంగైఅమ్మన్ ఆలయ వీధి, ఠాగూర్ వీధి, సిండికేట్ కాలని, బాలాజీ నగర్, తిరుమలై నగర్. **మాధవరం:** జీఎన్‌టీ రోడ్డు, గణపతి గార్డెన్, వీజీపీ నగర్ వీధి, కంధన్ నగర్, కాళియమ్మాళ్ నగర్, కర్పగం నగర్, గణేశ్ నగర్, నాగవల్లి అవెన్యూ, ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్డు, శ్రీనివాస నగర్, సంజయ్ నగర్, రాజాజీ రోడ్డు, బృందావనం గార్డెన్, నేతాజీ వీధి, స్వామియార్‌తోట్టం, ఎంజీఆర్ నగర్, భజన ఆలయ వీధి, సత్యమూర్తి వీధి, వీరపాండి వీధి, అయ్యతోట్టం, తనికాచలం నగర్, పెద్ద రోడ్డు, వసుధీన్ గార్డెన్, వీటీసీ నగర్.

వ్యాసర్పాడి: మాత్తూర్ రింగ్ రోడ్డు, ఎస్టేట్ పార్క్, పొన్ నగర్, రోస్ నగర్, ముంతాజ్ నగర్, శ్రీనివాస మోడల్ టౌన్, పార్వతిపురం, అన్నై నగర్, సామువేల్ నగర్, ధనలక్ష్మి నగర్, మంజంబాక్కం

ఐటీసీ: దురైపాక్కం, ఒగ్గియందురైపాక్కం, ఒగ్గియం పేట, రాజీవ్‌గాంధీ రోడ్డు, నేతాజీ వీధి, భారతియార్ వీధి, శాంతోమ్ అవెన్యూ, వివేకానంద వీధి, వినాయక అవెన్యూ, సిరుచేరి, సిప్కాట్ సిరుచేరి, నత్తం లింక్ రోడ్డు, ఏకాటూర్.

తాంబరం: ఆది నగర్, వేళచ్చేరి రోడ్డు కొంత భాగం, వినోబా నగర్, ఆనందపురం, వైమానిక దళం రోడ్డు, మదర్ థెరిస్సా నగర్, ప్రొఫెసర్ కాలని, అగరం మెయిన్ రోడ్డు, శాంతినికేతన్ కాలని ఎక్స్‌టెన్షన్, పార్వతి నగర్, జ్యోతివెంకటాచలం నగర్, ప్రశాంతి కాలని, బాలచందర్ అవెన్యూ, బృందావన్ నగర్, భగవతి నగర్, నటరాజ్ నగర్, లక్ష్మీ నగర్, టెలిఫోన్ ఎక్స్చేంజ్, వైద్యలింగం రోడ్డు, రామకృష్ణా నగర్ 1 నుంచి 6 వీధులు, బాబూ వీధి, వైద్యలింగం వీధి, పాంబన్ స్వాముల రోడ్డు, వయొలెట్ స్కూల్, ముల్లై నగర్, అంబేద్కర్ వీధి, వైగై నగర్, గాంధీ నగర్, పాత స్టేట్ బ్యాంక్ కాలని, కామరాజ్ వీధి, గాంధీ రోడ్డు.

పల్లావరం: కామరాపురం, పమ్మల్, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, అన్నై థెరిస్సా వీధి, జయతీర్థ రావు వీధి, కామరాజపురం అన్ని వీధులు, ఇంజనీర్ అవెన్యూ, మడిపాక్కం 200 అడుగుల మేడవాక్కం రోడ్డు, మేడవాక్కం బస్టాండ్, పెద్ద వీధి, తిరువళ్లువర్ నగర్, అంబాళ్ నగర్, గాంధీ వీధి, రంగా నగర్, అన్బు నగర్, తేన్‌మొళి నగర్, పిల్లయార్ ఆలయ వీధి, బాలమురుగన్ వీధి, దురైస్వామి వీధి, కుమరన్ నగర్, సౌందరరాజన్ నగర్, ధర్మరాజ ఆలయ వీధి, ఐఆర్డీ, రాధా నగర్, భారతి పురం, సుభాష్ నగర్, ఐఆర్డీ పాలిటెక్నిక్ కాలేజ్, నెహ్రూ నగర్, పమ్మల్ ఏరియా, హెచ్ఎల్ కాలని, పసుమ్‌పొన్ నగర్, వెంకటేశ్వర నగర్, అగస్తీశ్వర నగర్, విమల్ నగర్, లక్ష్మీ నగర్, ఎంజీఆర్ వీధి, టీటీకే నగర్, భారతి నగర్, అమ్మన్ ఆలయ వీధి, రాజాజీ నగర్, ఈశ్వరి నగర్, శక్తి నగర్, గణపతి నగర్, సరోజిని నగర్, దర్గా రోడ్డు, పల్లావరం ఈస్ట్.

తిరుచ్చి విమానాశ్రయంలో రూ.1.83 కోట్ల విలువైన బంగారం స్వాధీనం


ప్రయాణికుడు తీసుకొచ్చిన ఫ్రూట్ మిక్స్ పరికరం - పరికరంలో దాచిన బంగారం

పెరంబూర్, జూన్ 14: తిరుచ్చి విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి నుంచి రూ.1.83 కోట్ల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విదేశాల నుంచి తిరుచ్చికి వస్తున్న విమానాల్లో అక్రమంగా బంగారం తరలిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో, అధికారులు విమాన ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో, దుబాయ్ నుంచి వచ్చిన విమానంలోని ఓ ప్రయాణికుడిని అనుమానించిన అధికారులు, అతనిని తనిఖీ చేశారు. అతను తనతో తీసుకెళ్తున్న జ్యూస్ మిక్సర్‌ను పరిశీలించగా, అందులో దాచిన 2.579 కిలోల బంగారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

పుదువై మంత్రి కుమారుడి గోదాములో సోదాలు

● గంధపు చెక్కలు స్వాధీనం

పుదుచ్చేరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర మంత్రి కుమారుడికి చెందిన ఒక గంధపు నూనె తయారీ ఫ్యాక్టరీలో తమిళనాడు రాష్ట్ర అటవీ శాఖ అధికారులు రెండో రోజైన శుక్రవారం కూడా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో గంధపు చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి, ఆ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల వద్ద జరిపిన ప్రాథమిక విచారణలో కేరళ నుంచి ఈ గంధపు చెక్కలు వస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఆ ఫ్యాక్టరీ యజమానితో పాటు మరో నలుగురి వద్ద లోతుగా విచారణ జరపాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల కేరళ నుంచి రాష్ట్రంలోని సేలం జిల్లాలోకి ప్రవేశించిన ఒక కంటైనర్ లారీని ఆపి తనిఖీ చేయగా, అందులో భారీ మొత్తంలో గంధపు చెక్కలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 86 బస్తాల్లో రూ.కోటి విలువ చేసే 1.5 టన్నుల గంధపు చెక్కలను స్వాధీనం చేసుకుని, కేరళకు చెందిన సొహైల్, రెహ్మాన్‌ను అరెస్టు చేశారు. వీరివద్ద జరిపిన విచారణలో వారిచ్చిన సమాచారం మేరకు.. మహ్మద్ మిసైల్, అఫ్రార్, ఫజాస్, ఉమ్మర్‌ని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరపగా, ఈ గంధపు చెక్కలను పుదుచ్చేరిలోని ఒక మంత్రి కుమారుడికి చెందిన ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్టు తేలింది. దీంతో అటవీ శాఖ అధికారులు ఆ ఫ్యాక్టరీలో తనిఖీలు చేశారు.

పంచలోహ విగ్రహాలు లభ్యం


విగ్రహాలు, పూజా సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

పెరంబూర్, జూన్ 14: తంజావూరు జిల్లా పాపనాశం సమీపంలో ఇల్లు నిర్మించుకొనేందుకు గోతులు తవ్విన సమయంలో ప్రాచీన పంచలోహ విగ్రహాలు, పూజా సామగ్రి బయల్పడ్డాయి. దేవరాయన్‌పేట శివాలయం వీధికి చెందిన మహమ్మద్ ఫైజల్ తనకు సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. పునాదుల కోసం గుంతలు తవ్వే సమయంలో, అక్కడ అంబాళ్, సోమనాథర్, ప్రదోచకర్, నాయకి, తిరుజ్ఞానసంబంధర్ సహా పలు విగ్రహాలు, పూజా సామగ్రి, శంఖం తదితరాలు బయల్పడ్డాయి. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న పురావస్తు శాఖ అధికారులు ఆ విగ్రహాలను పరిశీలిస్తున్నారు. అలాగే, ఆ ప్రాంతంలో మరేవైనా విగ్రహాలు ఉన్నాయా అంటూ అధికారులు సమక్షంలో తవ్వకం పనులు చేపట్టారు.

అదుపుతప్పి లారీని ఢీకొన్న బస్సు

● 25 మందికి గాయాలు


పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు

పెరంబూర్, జూన్ 14: ధర్మపురి - సేలం జాతీయ రహదారిలోని తోప్పూర్ కనవాయ్ ప్రాంతంలో ప్రభుత్వ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో విద్యార్థులు సహా 25 మంది గాయపడ్డారు. తోప్పూర్ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణపనులు జరుగుతుండడతో ఒక మార్గంలోనే వాహనాలను అనుమతిస్తున్నారు. శుక్రవారం ఉదయం ధర్మపురి నుంచి బయల్దేరిన బస్సు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో విద్యార్థులు సహా 25 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు పక్కన పడేసిన టన్నుల కొద్దీ ఆపిల్ పండ్లు



ప్యారీస్, జూన్ 14: స్థానిక అంబత్తూర్ పరిధిలోని అయ్యపాక్కం రోడ్డు పక్కన టన్నుల కొద్దీ ఆపిల్ పండ్లు పడేసి పరారైన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయ్యపాక్కం నుంచి తిరువేర్కాడుకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఓ కల్యాణ మండపం సమీపంలో లక్షలు విలువచేసే మూడు టన్నులకు పైగా ఆపిల్ పండ్లను గుర్తుతెలియని వ్యక్తులు లారీల ద్వారా తరలించి రోడ్డు పక్కన పేర్చారు. వీటిలో 90 శాతానికి పైగా పండ్లు కుళ్లిపోయి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు తిరుముల్లైవాయల్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ఆహార భద్రతా విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలికి చేరుకున్న అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు.

రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం

● ఐదుగురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 14: స్థానిక ఎంజీఆర్ నగర్ సమీపంలోని నెసపాక్కం, సాలిగ్రామం ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు, సుమారు రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్ట్ చేశారు. నెసపాక్కం సాయిబాబా ఆలయం సమీపంలో కొంతమంది యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకున్న పోలీసులు అనుమానాస్పదంగా సంచరించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రెండు కిలోల గంజాయి పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పులియాంతోపుకు చెందిన మణికంఠన్, సూర్య, శరవణన్‌గా గుర్తించారు. అదే విధంగా సాలిగ్రామం ధనలక్ష్మి కాలనీలో ఉన్న అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తులో తనిఖీలు నిర్వహించిన పోలీసులు, మరిజువనాస్ అనే ఉన్నత స్థాయి గంజాయిని విక్రయించిన అభినేష్, గౌరిశంకర్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి 50 గ్రాములకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

17న బక్రీద్

● సంతల్లో సందడిగా పొట్టేళ్ల విక్రయాలు



ప్యారీస్, జూన్ 14: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ఈ నెల 17న జరుపుకోనున్న ముస్లింలు ఖుర్బానీ కోసం పొట్టేళ్ల కొనుగోలును ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిర్వహిస్తున్న పశువుల సంతల్లో ఇప్పటివరకు రూ.25 కోట్లకు పైగా పొట్టేళ్లు విక్రయించారు. కడలూరు జిల్లా వేపూరు, తిరుచ్చి, విల్లుపురం, పెరంబలూరు, సేలం, కరూర్, కళ్లకుర్చి, సెంజి, మదురై జిల్లా తిరుమంగళం, స్థానిక పల్లావరం, ఎంకేబీ నగర్, పులియాంతోపు ప్రాంతాల్లో ఉన్న సంతలలో మూడు రోజుల నుంచే పొట్టేళ్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. వచ్చే 16వ తేది ఆదివారం కూడా బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక సంతను నిర్వహించనున్నట్లు వ్యాపారులు ప్రకటించారు.



పెట్టెల నుంచి
తేనె తీస్తూ...

చక్కెరకు ప్రత్యామ్నాయం తేనె. కాఫీ, టీ, గ్రీన్ టీ, పళ్లరసం తదితరాల్లో తేనె కలుపుకొని సేవించొచ్చు. ఆరోగ్యానికి మంచిది. శరీర బరువు తగ్గించుకొనేందుకు ఉపయోగపడుతుంది. అలా పలురకాలుగా సహజసిద్ధంగా తేనెటీగలు పెంచి, తేనె తీసి విక్రయిస్తూ ఆర్థికంగా లాభపడుతున్నారు నామక్కల్ జిల్లాకు చెందిన విద్యశ్రీ. దీని పై ఆమె తరుణితో మాట్లాడుతూ...

- పెరంబూర్





తెనెటీగల పెంపకాన్ని వివరిస్తూ...



విద్యశ్రీ

తరుణి



నేను డిగ్రీ పూర్తిచేసి స్వయంగా తేనెటీగల పెంపకం చేపట్టా. తొలుత ఐదు పెట్టెల్లో తేనెటీగల పెంపకం చేపట్టా. కానీ, పెట్టెల నుంచి తేనెటీగలు ఎగిరిపోయాయి. అలా ఎగిరేందుకు కారణం కనిపెట్టా. అనంతరం కళాశాల విద్య పూర్తి చేసిన తర్వాత, గతంలో చేసిన తప్పులు సరిదిద్దుకుని 60 పెట్టెలు ఏర్పాటు చేశా. 'ఫ్యూచర్ నేచర్' అనే పేరుతో సహజసిద్ధ తేనె విక్రయాలు చేపట్టా.

తేనెటీగల పెంపకంలో విద్యశ్రీ

తక్కువ స్థలంలోనే...

తేనేటీగలు పెంచడానికి శ్రద్ధ అవసరం. ప్రత్యేకమైన స్థలం, తోట అవసరం లేదు. తక్కువ స్థలంలోనే సంరక్షించవచ్చు. నాకు కళాశాల చదువుతున్న సమయంలో తేనేటీగల పెంపకంపై ఆసక్తి ఉండేది. తొలి ప్రయత్నంతో ఫలితం ఇవ్వలేదు. అప్పట్లో దాన్ని నిలిపి, కళాశాల విద్య పూర్తి చేశా. అనంతరం పూర్తిస్థాయిలో తేనెటీగల పెంపకంపై దృష్టి సారించా. 60 పెట్టెలు కొనుగోలు చేసి తేనెటీగల పెంపకం ప్రారంభించా. ప్రస్తుతం నామక్కల్ సహా చుట్టుపక్కల జిల్లాల్లో ఆర్డర్లు వస్తున్నాయి. అంతేకాకుండా, తేనెటీగల పెంపకం చేపట్టాలనుకొనే వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తుంటా. అలాంటి వర్క్‌షాప్‌ల్లో పాల్గొనలేని వారు నేరుగా మా ఫాంకు వస్తే డెమో ద్వారా చూపిస్తుంటా. అలా వర్క్‌షాప్‌లకు హాజరై ఈ పెంపకం చేపట్టాలనుకొనే వారికి అవసరమైన పెట్టెలతో పాటు తేనేటీగలు విక్రయిస్తుంటా.

పరిమాణం బట్టి తేనే

కొవిడ్ అనంతరం 2022 చివరిలో ఉత్పత్తి ప్రారంభించా. ఒక పెట్టెలో అతి తక్కువగా 2,000 వేల తేనెటీగలు పెంచవచ్చు. వాటి ద్వారా 750 గ్రాముల తేనె సేకరించొచ్చు. ఆ పెట్టెలో మనం వేసే పూలలోని మకరందాన్ని తేనెటీగలు స్వీకరిస్తాయి. సాధారణంగా తేనెటీగల జీవితకాలం ఆరు వారాల నుంచి అధికంగా 21 వారాలు. అవి జీవించి ఉన్నంతవరకు తేనె తీసుకొనే వీలుంటుంది. తేనెటీగలు పూల నుంచి సేకరించిన మకరందాన్ని ఈ పెట్టెల్లో నిల్వచేస్తాయి. అందువల్ల పూల పరిమాణం బట్టి తేనె పరిమాణం కూడా పెరుగుతోంది. పెట్టెలు ఉంచి నెల తర్వాత తేనె తీసుకోవచ్చు. ఒకసారి తేనె తీసిన తర్వాత పెట్టెలను మరో స్థానంలో ఉంచాలి.

ఓర్పు... సహనం

సరైన భద్రతా కవచాలు ధరించకుండా, తేనేటీగలు కుట్టకుండా చేతులతో ఎలా తేనె తీస్తారు అని పలువురు ప్రశ్నిస్తుంటారు. మనం తేనెటీగలతో ఎలా నడుచుకుంటామో, అవి కూడా మనతో అలాగే నడుచుకుంటాయి. మన ఇంట్లోని పెంపుడు జంతువులు, పక్షులను ఎంతో ప్రేమతో పెంచుకుంటాము. అవి కూడా మనతో అంత విశ్వాసంగానే ఉంటాయి. తేనెటీగలు కూడా అలాగే ఉంటాయి. తొలుత వాటిని చేతుల్లోకి తీసుకునేందుకు భయపడేదానిని, కొన్ని సమయాల్లో అవి కుట్టాయి కూడా. అనంతరం ఓర్పు, సహనంగా సంరక్షించాలని తెలుసుకున్నా.





తేనెటీగల సంరక్షణలో...

వ్యాపార దృష్టి ఒద్దు...

ఈ పనులను వ్యాపార దృష్టితో చూడరాదు. సంరక్షిస్తున్నాను అనే కోణంలో చూడాలి. పెట్టెలు ఉంచే ప్రాంతాల్లో కనీసం పుష్పించే మొక్కలుండాలి. అలాగే, పూలు అధికంగా ఉండే ప్రాంతాల్లోనూ పెట్టెలు ఏర్పాటుచేయవచ్చు. అదే సమయంలో పెట్టెలను నీడ ఉన్న ప్రాంతంలో ఉంచాలి. ముఖ్యంగా, పెట్టెల చుటూ ఉన్న పూల మొక్కల పెంపకంలో రసాయన మందులు వినియోగించరాదు. అలాగే, పెట్టెలుంచే ప్రాంతంలో పురుగు మందులు చల్లరాదు. కానీ, ప్రస్తుతం అన్ని తోటల్లో రసాయన పురుగు మందుల వాడకం అధికమైంది. అలాంటి ప్రాంతాల్లో తేనేటీగలు బయటకు వెళ్లకుండా పెట్టెలోనే ఉంచి సంరక్షించాలి. ఆ సమయాల్లో పెట్టెలో చక్కెర, నీరు ఉంచాల్సి ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం అంటే నాటు చక్కెర, చెరకు రసం ఉంచితే చాలు.
వీటిపై వచ్చే ఆదాయం స్థిరమైనది కాదని గుర్తించాలి. సీజన్‌కు లభించే పండ్లు లాగా శీతాకాలంలో తేనెకు అనువైన కాలం. వాటి సంరక్షణ, పెట్టెల ఖర్చు తదితరాలు పోను నెలకు రూ.15,000-రూ.20,000 వరకు సంపాదించుకోవచ్చు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో స్వచ్ఛమైన తేనె అంటూ విక్రయిస్తున్నారు. అది స్వచ్ఛమైనదా, కల్తీనా అనే విషయం తెలియదు. మేము తేనేటీగల పెంపకంతో పాటు తేనె తీసే విధానాలు కూడా వివరించడంతో పాటు చేసి చూపుతుంటాను. అదే సమయంలో తేనెతో తయారుచేసిన గుల్కండ్, ఫ్రూట్ మిక్స్ సహా పలు రుచికరమైన పదార్థాలు విక్రయిస్తున్నాము.

'లాంథర్' నిర్మాత జీవితంలో వెలుగులు నింపాలి

● హీరో విదార్థ్



ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రపరిశ్రమపై నిర్మాత బద్రికి ఉన్న పిచ్చి అభిమానం కారణంగా 'లాంథర్' చిత్రం నిర్మాత జీవితంలో వెలుగులు నింపాలని ఆ చిత్ర హీరో విదార్థ్ ఆకాంక్షించారు. విదార్థ్ హీరోగా నటించిన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ వేడుకలో దర్శకుడు రవికుమార్, ఏఆర్‌కే శరవణన్, కార్తికేయన్, కనల్ కన్నన్, నటుడు పీఎల్ తేనప్పన్ తదితర సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ చిత్రం ఆడియోను నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్ ఆవిష్కరించి, చిత్ర బృందానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. సాజీ సలీం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో విదార్థ్, శ్వేతా డోరతి, విపిన్, సహానా, పశుపతి రాజ్, గజరాజ్ తదితరులు నటించారు. జ్ఞాన సౌందర్ సినిమాటోగ్రఫీ సమకూర్చగా, ఎంఎస్ ప్రవీణ్ సంగీత బాణీలు సమకూర్చారు. ఈ ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు షాజీ సలీం మాట్లాడుతూ... 'నేను చెప్పిన కథపై గట్టి నమ్మకంతో సినిమా తీసేందుకు ముందుకు వచ్చిన నిర్మాత బద్రీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు. నా తండ్రి కేఎన్ మహ్మద్ షరీఫ్ నా బాల్యం నుంచే అనేక నవలలు కొనిచ్చి చదవమని చెప్పేవారు. ఆ తర్వాత ఆయనకు నచ్చిన కథలను వినిపించేవారు. ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన ఇచ్చిన శిక్షణ వల్లే ఈ వేదికపై నిల్చొనివున్నాను. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడం వెనుక నా కుటుంబ సభ్యులు సహాయ సహకారాలున్నాయి. వారందరికీ రుణపడివుంటా' అన్నారు. హీరో విదార్థ్ మాట్లాడుతూ, 'ఈ లాంథర్ చిత్రం నిర్మాతతో పాటు ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

సినిమాకు భాష లేదు

● జాసన్ షా



భారతీయ చిత్రపరిశ్రమలో తనదైన చెరగని ముద్రవేసుకున్న నటుడు జాసన్ షా... సినిమాకు భాషా సరిహద్దులు లేవంటున్నారు. సినిమా అనేది భాషకు మించిందన్నారు. విదేశాల్లో పుట్టిన జాసన్ షా... భారతదేశంలో పెరిగారు. అమెరికాలోని న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ పొందారు. ఆ తర్వాత తన నటనా ప్రయాణాన్ని హిందీలో ప్రారంభించారు. నాటకాలతో పాటు పలు బాలీవుడ్ చిత్రాల్లో సహాయక పాత్రలతో పాటు విలన్ పాత్రలను కూడా చేశారు. తమిళంలో 'మిషన్ చాప్టర్-1', '1947 ఆగస్టు 16' వంటి అనే చిత్రాల్లో నటించారు. పలు హిందీ వెబ్ సిరీస్‌లలో కీలక పాత్రలను పోషించారు. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో వచ్చిన 'హీరమండి' అనే వెబ్ సిరీస్‌లో లీడ్ రోల్ చేశారు. ఇలా భారతీయ చిత్రసీమలో తనదైన ముద్ర వేసిన జాసన్.. తమిళం, తెలుగు, హిందీ ఇలా పలు భారతీయ భాషల్లో తన నటనా నైపుణ్యం కారణంగా ప్రజల దృష్టిని ఆకర్షించడమే కాకుండా, వరుస సినీ అవకాశాలు దక్కించుకుంటూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.

'లారా' మూవీ ఫస్ట్‌లుక్ రిలీజ్

చిత్రజ్యోతి

డెబ్యూ డైరెక్టర్ మణిమూర్తి రూపొందించిన 'లారా' చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ సీనియర్ నటుడు సత్యరాజ్ విడుదలరు. ప్రముఖ రియల్టర్ ఎం.కార్తికేశన్ ఎంకే ఫిల్మ్ మీడియా వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానరుపై నిర్మించారు. ఆర్‌జే రవీన్ ఛాయాగ్రహణం అందించగా, రఘు శరవణ్ కుమార్ సంగీతం సమకూర్చారు. అశోక్ కుమార్ హీరోగా నటించగా, అనుశ్రీ, వెన్మది, వర్షిణి కథానాయికలు. ప్రధాన పాత్రల్లో మ్యాథ్యూ వర్గీస్, కదిరేశన్, ఎస్‌కే బాబు తదితరులు నటించారు. సస్పెన్స్, థ్రిల్లింగ్, మిస్టరీ, ఇన్వెస్టిగేషన్ మేళవింపుగా ఈ కథ సాగుతుంది. పొల్లాచ్చి, కోయంబత్తూరు, కడలూరు, కారైక్కాల్, పాండిచ్చేరి తదితర ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఈ సినిమాపై దర్శకుడు మణిమూర్తి మాట్లాడుతూ... 'ఈ కథ కోస్తా తీరంలో సాగుతుంది. అందుకే కడలూరు, పాండిచ్చేరి, కారైక్కాల్, పొల్లాచ్చి, కోవై వంటి ప్రాంతాల్లో చిత్రీకరించాం. నిర్మాత చెప్పిన స్టోరీని మరింతగా డెవలప్ చేసి స్క్రీన్‌ప్లే, స్క్రిప్టును సిద్ధం చేశా. వివిధ లొకేషన్‌లలో నాలుగు షెడ్యూల్స్‌లో షూటింగ్ చేశాం' అని వివరించాం.



ప్రయోగాత్మక మూవీగా నిలుస్తుంది

- దర్శకుడు రాహుల్ కబాలి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న చిత్ర బృందం

తాము తెరకెక్కించిన 'భయమరియ బ్రహ్మై' చిత్రం ఇతర సినిమాలతో పోల్చితే ఒక ప్రయోగాత్మక చిత్రంగా నిలుస్తుందని ఆ చిత్ర దర్శకుడు రాహుల్ కబాలి అన్నారు. 60ఎంఎం ఫిల్మ్ పతాకంపై రాహుల్ కబాలి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంఒ జేడీ ప్రధాన పాత్రను పోషించగా, గురు సోమసుందరం, జాన్ విజయ్, హరీష్ ఉత్తమన్, వినోద్ సాగర్, జాక్ రాబిన్‌సన్, విశ్వనాథ్, సాయ్ ప్రియాంక రుథ్, దివ్య గణేష్, హరీష్ తదితరులు నటించారు. నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ చిత్ర విశేషాలను మూవీ బృందం ఏర్పాటు చేసింది. ఇందులో దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ... 'ఇప్పటివరకు వచ్చిన చిత్రాలకు భిన్నంగా, ప్రయోగాత్మక మూవీగా నిలుస్తుంది. ఈ ప్రయోగాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్‌లో సినిమాను చూస్తూ ఎంజాయ్ చేస్తారు' అని పేర్కొన్నారు. హీరో జేడీ మాట్లాడుతూ... 'ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లడానికి ఒక యేడాది ముందు నుంచే రాహుల్ నేను కలిసి ప్రీప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమయ్యాం. సమష్టి కృషితో ఈ సినిమాను తెరకెక్కించాం. ఈ నెలలో విడుదల చేస్తున్నాం. మీడియాతో పాటు ప్రేక్షకులు కూడా ఆదరించాని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. హీరోయిన్ సాయి ప్రియాంక రుథ్ మాట్లాడుతూ... 'యేడాదిన్నర తర్వాత ఈ చిత్రం థియేటర్‌లలో విడుదలకు సిద్ధమైంది. ఎంతో సంతోషంగా ఉంది. ఇందులో నటించడం మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది. నా పాత్ర ఎంతో బాగా వచ్చింది. దర్శక నిర్మాతలకు థ్యాంక్స్' అని పేర్కొన్నారు.

ఘనంగా 'వివిద్ వాయిసెస్' ఆవిష్కరణ

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కి) ఆధ్వర్యంలో 'వివిద్ వాయిసెస్' పేరుతో ఫ్లో పాడ్‌కాస్ట్ సిరీస్ ఆవిష్కరణ ఇటీవల చెన్నైలో ఘనంగా జరిగింది. వివాహానికి ముందు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం, లింగ వివక్షను గుర్తించడం, పిల్లలతో మనసు విప్పి మాట్లాడ్డం, వైఫల్యం ఎదురైనప్పుడు స్థితిస్థాపకత కోసం చిట్కాలు వంటివన్నీ ఇందులో పొందుపరిచారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి సినీ మహిళా దర్శకురాలు ఫరాఖాన్ తదితరులు కూడా హాజరయ్యారు.

ఆవిష్కరణలో ప్రముఖులు



సేలంలో వరమహాలక్ష్మి సిల్క్స్ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

అడయార్, జూన్ 14: సాయి సిల్క్స్ కళామందిర్ జిల్లా కేంద్రమైన సేలంలోని నాలుగు రోడ్ల కూడలి, కొత్త బస్టాండు వద్ద కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ రెండో షోరూంను ప్రారంభించింది. దీంతో కలుపుకుని తమిళనాడులో ఈ షోరూంల సంఖ్య పదికి చేరుకోగా, దేశవ్యాప్తంగా 61కి చేరింది. ఈ షోరూంను సెండలగర జీయర్ స్వామీజీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇక్కడ బనారసి, పటోలా, కోట, పైథాని, ఆర్గాంజ, కుప్పడం, కాంచీపురం సిల్క్ చీరలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ధరలకు విక్రయానికి ఉంచారు. ఈ సందర్భంగా సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ చలవాడి మాట్లాడుతూ... రాష్ట్రంలో పదో స్టోర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తమిళనాడులో రోజు రోజుకూ పెరుగుతున్న వస్త్ర మార్కెట్‌ను అందిపుచ్చుకునేందుకు వీలుగా తమ వ్యాపార కార్యకలాపాలను దశలవారీగా విస్తరిస్తున్నట్టు ఆయన వివరించారు. కాగా, తమ కంపెనీ తొలి షోరూంను 2011లో బెంగళూరులోని చిక్‌పేట్‌లో ప్రారంభించామని ఆయన గుర్తు చేశారు.

మేథో వైకల్యంతో బాధపడే బాలికలకు అబ్వీ సాయం



బాలికలతో అబ్వీ ప్రతినిధులు

అడయార్, జూన్ 14: మేథో వైకల్యంతో బాధపడే బాలికలకు వివిధ రకాలుగా సాయం చేసేందుకు, దోహదపడేందుకు అబ్వీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానిక కమ్యూనిటీ వలంటరీంగ్ సహకారంతో 6 నుంచి 18 యేళ్ల మధ్య వయసు కలిగి మేథో వైకల్యంతో బాధపడే బాలికలకు సాయం చేసేందుకు శ్రీ అరుణోదయం చారిటబుల్ ట్రస్ట్‌ను కలుపుకుని ముందుకు సాగుతున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్ సురేష్ పట్టత్తిల్ వెల్లడించారు. ఇందుకోసం 'ద్యూరింగ్ అవర్ వీక్ ఆఫ్ పాజిబిలిటీస్' అనే పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వార్షిక స్వచ్ఛంద కార్యక్రమాన్ని ప్రారంభించామని, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉండే అబ్వీ ఉద్యోగులు స్థానిక కమ్యూనిటీ వలంటీర్ల ద్వారా సేవ చేసేందుకు దోహదపడుతుందని వివరించారు. కాగా, బయో ఫార్మాస్యూటికల్ కంపెనీ ఈ తరహా ఈవెంట్‌ను చెన్నై, ముంబై, న్యూఢిల్లీ, బెంగళూరుల్లో నిర్వహించినట్టు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ ప్లాస్టిక్ ప్రదర్శన

ప్యారీస్, జూన్ 14: తమిళనాడు ప్లాస్టిక్స్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ (టాప్మా) ఆధ్వర్యంలో నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ప్లాస్టిక్ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంటోంది. ఆరో సారి టాప్మా 17,500 చ.మీ విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనలో భారత్, చైనా తదితర విదేశాలకు చెందిన 300లకు పైగా స్టాళ్లను కొలువుదీర్చారు. ఈ నెల 17వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శనను తిలకించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్లాస్టిక్ ముడిపదార్థాల తయారీ విధానం, వినియోగం, ప్లాస్టిక్ కారణంగా పర్యావరణానికి కలిగే నష్టం, అవగాహన తదితర కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.రాధాకృష్ణన్, టాప్మా పర్యావరణ కమిటీ ఛైర్మెన్ స్వామినాథన్, నిర్వాహకులు, విద్యార్థులు, చిన్న పరిశ్రమల నిర్వాహకులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. ప్రదర్శనలో యంత్రాలు, వస్తువులు వంటివి చోటుచేసుకున్నాయి. కొత్త యంత్రాలు రూ.1,000 కోట్ల వరకు విక్రయమయ్యే అవకాశమున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రదర్శన ప్రారంభించి విద్యార్థులు, నిర్వాహకులతో కలసి తిలకిస్తున్న జీసీసీ కమిషనర్ రాధాకృష్ణన్

అలరిస్తున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



ప్రదర్శన ప్రారంభోత్సవంలో మోడళ్లు

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూరులోని కళాక్షేత్ర రోడ్డులో ఉన్న సీఈఆర్‌సీ క్యాంపస్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేనేత, హస్తకళా ప్రదర్శన విశేషంగా అలరిస్తోంది. టీవీ ఫేం కీర్తి శాంతను ఇటీవల ప్రారంభించిన ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత, హస్తకళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ఇందులో ఛత్తీస్‌గడ్ కాంతా, కచ్ వర్క్ చీరలు, వెస్ట్‌బెంగాల్ చీరలు, లక్నో చికెన్ వర్క్ చీరలు, బనారసి సిల్క్, జందాని సిల్క్, వారణాసి షిఫాన్ చీరలు, సంఘనేరి ప్రింట్, రాజస్థాన్ చీరలు, గుజరాత్ బాందిని పటోల చీరలు, కాంచీవరం, ధర్మవరం, గద్వాల్ చీరలు తదితరాలెన్నో ప్రదర్శనకు సిద్ధంగా వున్నాయి. ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను సందర్శకులు ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు వీక్షించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

శ్రీ కళాసుధ ఆధ్వర్యంలో రేపు పితృదినోత్సవం

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'శ్రీ కళాసుధ' తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'పితృదేవోభవ' పేరుతో పితృదినోత్సవం జరగనుంది. టి.నగర్, విజయరాఘవ రోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా 'భారతీయం' సత్యవాణికి 'గురుశ్రీ' బిరుదు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌బీఐ చెన్నై సర్కిల్ జనరల్ మేనేజర్ ఎంవీఆర్ మురళీకృష్ణ, రవిప్రసాద్ యూనిట్ నిర్వాహకులు పి.చెంగయ్య, క్రెడాయ్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు పద్మ దేవదాస్, ప్రముఖ గాయని పి.సుశీల, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసురావు, దివంగత గాయకులు పీబీ శ్రీనివాస్ తనయుడు డాక్టర్ పీబీ ఫణీందర్ హాజరుకానున్నారు. సంస్థ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ స్వాగతోపన్యాసం చేయనున్న ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.